

7 ఓడరేవుల్లో తుపాను హెచ్చరిక

- బలపడిన అల్పపీడనం



పర్యాటకులు లేక నిర్మానుష్యంగా ఉన్న కుట్రాలం జలపాతం

ప్యారీస్, మే 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం గురువారం బలపడి, ఉత్తర దిశగా పయనించి వాయుగుండంగా మారనుందని, దీని ప్రభావంతో రాష్ట్రంలో దక్షిణ జిల్లాలు, కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం పేర్కొంది. కోస్తా తీరంలో గంటకు 50 నుండి 60 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలతో రాష్ట్రంలోని 7 ప్రధాన ఓడరేవుల్లో గురువారం ఉదయం తుపాను హెచ్చరికల సూచన వెగురవేశారు. చెన్నై నుంచి కన్నియాకుమారి వరకు గల సముద్రతీర ప్రాంతాలకు చెందిన జాలర్లు ఈదురు గాలుల ప్రభావం తగ్గేవరకు సముద్రంలో చేపలవేటకు వెళ్ళరాదని వాతావరణశాఖ హెచ్చరించింది. తీవ్ర అల్పపీడన ప్రభావంతో బంగాళాఖాతం అల్లకల్లోలంగా మారింది. సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతుండటంతో కోస్తా జిల్లాల ప్రజలకు లౌడ్ స్పీకర్ల ద్వారా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. మరో 24 గంటల్లో తుపాను తీరం దాటే అవకాశం ఉండటంతో చెన్నై, కడలూరు, నాటపట్నం, కాట్టుపల్లి, ఎన్నూర్, పుదుచ్చేరి, కారైక్కాల్ ఓడరేవుల్లో 1వ నెంబరు తుఫాను సూచన ఎగురవేసిన నేపథ్యంలో, రామనాథపురం జిల్లా పాంబన్, తూత్తుకుడి ఓడరేవుల్లో 3వ తుఫాను హెచ్చరికల సూచన ఎగురవేశారు. అదేవిధంగా పర్వతశ్రేణుల అధికంగా ఉన్న నీలగిరి, కోయంబత్తూరు జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రెడ్ అలర్ట్ ప్రకటించారు. మోస్తరు నుండి భారీవర్షాలు కురిసే జిల్లాల్లో వరద ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి సహాయక చర్యల ఏర్పాట్లను సిద్ధం చేసుకోవల్సిందిగా ఆయా జిల్లాల కలెక్టర్లకు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

కుట్రాలంలో స్నానాలకు నిషేధం...

నైరుతి రుతుపవనాలు ఈసారి ముందుగానే కేరళ రాష్ట్రాన్ని తాకిన నేపథ్యంలో, రాష్ట్రంలో తెన్‌కాశి, తిరునల్వేలి, కోవై, నీలగిరి జిల్లాల్లో మోస్తరు నుండి భారీవర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమ కనుమలు, కొండల దిగువ ఉన్న ప్రాంతాల్లో గత నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో అక్కడున్న వాగులు, చెరువులు, నీటిపరివాహక ప్రాంతాలు పూర్తిస్థాయిలో నిండాయి. మరోవైపు తెన్‌కాశి జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కుట్రాలం జలపాతాల్లో నీటి ప్రవాహం ఉధృతంగా మారడంతో జిల్లా యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఈ జలపాతాలవద్ద పర్యాటకులు స్నానాలు చేసేందుకు విధించిన నిషేధం ఐదో రోజైన గురువారం కూడా కొనసాగింది.



వేదికపై అన్నాడీఎంకే ప్రధాన నిర్వాహకులతో ఎడప్పాడి పళనిస్వామి

ఎన్నికల వ్యూహంపై చర్చ

- నేతలతో అన్నాడీఎంకే అధినేత వ్యూహరచన

ప్యారీస్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి వచ్చే ఏడాది ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల వ్యూహరచనపై అన్నాడీఎంకే నేతలు కూలంకషంగా చర్చించారు. అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శులు, జిల్లా ఇన్‌చార్జులు, జిల్లా బూత్ కమిటీలతో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి గురువారం భేటీ అయ్యారు. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాలిగైలో ఏర్పాటు చేసిన ఈ సమావేశం శుక్రవారం కూడా కొనసాగనుంది. 8 నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే సన్నద్ధమైంది. డీఎంకే ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపి, మళ్ళీ రాష్ట్ర పగ్గాలు చేపట్టాలనే లక్ష్యంతో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు కుదుర్చుకుంది. ఈ కూటమిలో డీఎండీకే, పుదియ తమిళగం, పురచ్చి భారతం, తమిళ మానిల కాంగ్రెస్, పీఎంకే తదితర ప్రాంతీయ పార్టీలను చేర్చుకునేందుకు ఈపీఎస్ ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల సమయానికి పార్టీని మరింత బలపరిచి ఓటు బ్యాంకు పెరిగేందుకు అనుకూలంగా చురుగ్గా పనిచేస్తున్న కార్యకర్తలతో బూత్ కమిటీలు నియమించే బాధ్యతలను ఆయా జిల్లా పార్టీ కార్యదర్శులకు, ఇన్‌చార్జులకు అప్పగించారు. పార్టీ జిల్లాస్థాయి నాయకుల్లో ఏర్పడే విభేదాలను తొలగించి, వారి మధ్య సఖ్యత నెలకొల్పేందుకు ఈపీఎస్ జిల్లా నాయకులతో రెండు రోజులు సమావేశమై చర్చించేందుకు నిర్ణయం తీసుకున్నారు.

21 జిల్లాల నాయకులు...

ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఉదయం 9 గంటలకు వెళ్ళిన ఈపీఎస్‌కు అన్నాడీఎంకే శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కాబోయే ముఖ్యమంత్రి ఈపీఎస్ జిందాబాద్ అంటూ కార్యకర్తలు కేరింతలతో అలరించారు. ఎడప్పాడి అధ్యక్షత వహించిన సమావేశంలో పార్టీ ప్రిసీడియం ఛైర్మెన్ తమిళ్ మగన్ హుస్సేన్, కోశాధికారి దిండుగల్ శ్రీనివాసన్, సీనియర్ నేతలు ఎస్పీ వేలుమణి, కేపీ మునిస్వామి, నత్తం విశ్వనాథన్, మహిళా విభాగం రాష్ట్రకార్యదర్శి వలర్మతి, మాజీమంత్రులు ఆర్‌బీ ఉదయ్‌కుమార్, సెల్లూరు రాజు, ఇసైక్కి సుబ్బయ్య, దళవాయి సుందరం, డాక్టర్ విజయ్‌భాస్కర్, రాజన్ చల్లప్ప, కడంబూర్ రాజు తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు సమావేశంలో మదురై, పుదుకోట, తేని, దిండుగల్, విరుదునగర్, శివగంగా, రామనాథపురం, తిరునల్వేలి, తెన్‌కాశి, తూత్తుకుడి, కన్నియాకుమారి, రాణిపేట, తిరువణ్ణామలై, కడలూరు, విల్లుపురం, నామక్కల్, కళ్లకురిచ్చి, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, ఈరోడ్ జిల్లాల వారు పాల్గొన్నారు.

నేటి సమావేశంలో...

శుక్రవారం జరిగే సమావేశంలో తిరుప్పూర్, కోయంబత్తూరు, నీలగిరి, తిరుచ్చి, పెరంబలూరు, అరియలూరు, కరూర్, తంజావూరు, నాగపట్నం, మైలాడుదురై, తిరువారూర్, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరు, వేలూరు, తిరుప్పత్తూరు, చెన్నై జిల్లాల నాయకులు పాల్గొంటారని అన్నాడీఎంకే కార్యాలయం తెలిపింది.

రాజ్యసభ సీటు కోసం 12 మంది పోటాపోటీ...

అన్నాడీఎంకేలో రాజ్యసభ సీటుకోసం 12 మంది సీనియర్ నేతల మధ్య గట్టిపోటీ నెలకొంది. పార్టీ తరఫున ఎవరిని అభ్యర్థులుగా నిర్ణయించాలన్న దానిపై ఈపీఎస్ సీనియర్లతో గురువారం సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకున్నట్లు సమాచారం.

తండ్రీకొడుకుల సవాల్

- రాందాస్, అన్బుమణి మధ్య భగ్గుమన్న ఆధిపత్యపోరు
- అతడిని కేంద్రమంత్రిని చేసి పెద్ద తప్పు చేశా
- నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే
- బీజేపీతో పొత్తు పెట్టుకుని పరువుతీశాడు
- కుమారుడిపై రాందాస్ తీవ్ర ధ్వజం
- నేడు పార్టీనేతలతో అన్బుమణి భేటీ

చెన్నై, మే 29 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడు, కేంద్ర మాజీమంత్రి డాక్టర్ అన్బుమణిపై పీఎంకే అధినేత డాక్టర్ రాందాస్ తీవ్ర ఆరోపణలు చేశారు. అన్బుమణి తన తల్లిపై సీసాతో దాడి చేశాడని ఆరోపించారు. అతడిని కేంద్రమంత్రిని చేసి చాలా పెద్ద తప్పు చేశానని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. అతడు నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే వస్తాయని, సభామర్యాద తెలియని అజ్ఞాని అని, బీజేపీతో పొత్తుపెట్టుకుని పార్టీ పరువు ప్రతిష్ఠలు దిగజార్చాడని తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో తండ్రీకొడుకుల మధ్య వివాదాలు భగ్గుమన్న విషయం తెలిసిందే. పార్టీలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తొలిసారి తండ్రీకొడుకుల మధ్య మనస్పర్థలు బయటపడ్డాయి. పార్టీలో తన మాటకు తిరుగులేదని, ఎవరికి పదవులివ్వాలనేది తన ఇష్టమని రాందాస్ ఆ వేదికపై ప్రకటించారు. అయితే అదే వేదికపై తన మేనల్లుడు ముకుందన్‌కు పార్టీ యువజన విభాగం పదవి ఇవ్వడం సబబు కాదని అన్బుమణి వ్యాఖ్యానించగా, పార్టీకి తానే అధినేతనని, తన నిర్ణయాన్ని ఎవ్వరూ వ్యతిరేకించలేరని రాందాస్ మండిపడ్డారు. అంతేగాక ఇకపై పార్టీకి తానే అధ్యక్షుడినని, అన్బుమణి కార్యాచరణ అధ్యక్షుడిగా మాత్రమే కొనసాగుతారని ప్రకటించారు. ఇలా యేడాది ప్రారంభం నుండి తండ్రీకొడుకుల మధ్య విబేధాలు కొనసాగుతూనే ఉన్నాయి. చిత్రాపౌర్ణమి రోజున మహాబలిపురం సమీపంలో జరిగిన పార్టీ యువజన మహానాడులో ఇద్దరూ కలిసే వున్నారు. ఆ తర్వాతే ఏమైందో ఏమోగానీ మళ్ళీ అన్బుమణిపై రాందాస్ విమర్శనాస్త్రాలు సంధించారు. తైలాపురం గార్డెన్‌లో జిల్లా కార్యదర్శుల సమావేశం ఏర్పాటు చేశారు. దానికి యాభైశాతానికి పైగా జిల్లా కార్యదర్శులు గైర్హాజరయ్యారు. వారంతా అన్బుమణి అనుచరులు కావడంతో రాందాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ జిల్లా కార్యదర్శులు గైర్హాజరుపై రాందాస్ వ్యాఖ్యానిస్తూ యువజన మహానాడులో బాగా అలసిపోవటం వల్లే వారు సమావేశానికి రాలేదని సర్దిపుచ్చుకున్నారు. ఆ తర్వాత ధర్మపురి సభలో అన్బుమణి మాట్లాడుతూ నెల రోజులుగా తనకు నిద్రలేదని, తాను చేసిన తప్పేమిటో తెలియటం లేదని, తనను ఎందుకు పదవి నుండి తొలగించారో ఇప్పటికీ అర్థంకాలేదన్నారు. ఈ నేపథ్యంలో తైలాపురం గార్డెన్‌లో గురువారం రాందాస్ మీడియా సమావేశంలో అన్బుమణిపై మళ్ళీ విరుచుకుపడ్డారు. అన్బుమణి ఏ తప్పు చేయలేదని, 35 యేళ్ల వయస్సులోనే అతడిని కేంద్రమంత్రిగా చేసి తానే పెద్ద తప్పు చేశానని వ్యాఖ్యానించారు. ఏం తప్పుచేశానంటూ ప్రజల దృష్టిని, పార్టీ కార్యకర్తలను దృష్టిమరల్చేలా ధర్మపురి సభలో అన్బుమణి సానుభూతి పొందేందుకు ప్రయత్నించాడని ఆరోపించారు. సభామర్యాదలు ఏ మాత్రం తెలియని అన్బుమణి ప్రతి సమావేశంలోనూ కాళ్లాపుతూ ఉంటాడన్నారు. అన్బుమణికి నాయకత్వం లక్షణాలు ఏ మాత్రం లేవని, సభ్యుల మాటలు పట్టించుకోడని ఆగ్రహం వ్యక్తం చేశారు.



డాక్టర్ రాందాస్, డాక్టర్ అన్బుమణి రాందాస్

బీజేపీతో పొత్తుకు నా కాళ్లుపట్టుకున్నారు...

గత పార్లమెంట్ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుందామని తాను చెప్పినా అన్బుమణి పట్టించుకోలేదని, అన్బుమణి, ఆయన భార్య సౌమ్య తన కాళ్ల పట్టుకుని బీజేపీతో పొత్తుపెట్టుకోవాలని ప్రాధేయపడ్డారని ఎద్దేవా చేశారు. ఆ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకోకపోవడం వల్ల పీఎంకే పరువు పోయిందన్నారు. తనకు పార్టీ పదవులపై ఆశ లేదని, అవసరమయితే సర్వసభ్యమండలి సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్బుమణిని పార్టీ నుండి తొలగించేందుకు వెనుకాడనని రాందాస్ హెచ్చరించారు.


నేడు బలప్రదర్శనకు అన్బుమణి సిద్ధం...

పార్టీ నేతలతో డాక్టర్ అన్బుమణి శుక్రవారం సమావేశమై పార్టీలో తనకున్న బలాన్ని ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్నారు. చోళింగనల్లూరు సమీపంలోని పనయూరు వద్దనున్న అన్బుమణి కార్యాలయంలో శుక్రవారం నుండి ఆదివారం వరకూ ఆయన వరుసగా జిల్లా కార్యదర్శులు, ఇన్‌ఛార్జులతో సమావేశమవుతున్నారు.

ముకుందన్ రాజీనామా...



డాక్టర్ రాందాస్, డాక్టర్ అన్బుమణి మధ్య అభిప్రాయబేధాలు రావటానికి కారకుడైన ముకుందన్ పీఎంకే యువజన విభాగం అధ్యక్ష పదవికి గురువారం రాజీనామా చేశారు. డిసెంబర్‌లో రాందాస్ మనవడు, అన్బుమణి మేనల్లుడు ముకుందన్ పరశురామన్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన విషయం తెలిసిందే. డాక్టర్ రాందాస్ తీసుకున్న ఆ నిర్ణయాన్ని ఆంగ్ల సంవత్సరాది వేడుకల సభలో అన్బుమణి తప్పుబట్టారు. ఈ నేపథ్యంలో ఉన్నట్టుండి ముకుందన్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాందాస్‌కు తన రాజీనామా లేఖ పంపినట్లు ముకుందన్ తెలిపారు.





సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఫోర్‌వే రహదారులను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

రూ.499.08 కోట్లతో ఫోర్ వే, ఫ్లైఓవర్లు

- ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రహదారుల శాఖ ఆధ్వర్యంలో రూ.499.08 కోట్లతో ఫోర్ రహదారులుగా నిర్మించిన మల్లియక్కరై - రాశిపురం, తిరుచెంగోడు - రహదారి, మదురై జిల్లా పళంగానత్తంలో రైల్వే లైన్‌పై నిర్మించిన ఫ్లైఓవర్, రాణిపేట జిల్లా మేల్‌పాక్కంలో నిర్మించిన గిరిజనుల నివాసాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. రాష్ట్ర రహదారులు, మినీ ఓడరేవుల శాఖ ఆధ్వర్యంలో సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీటిని ప్రారంభించారు.

జీసీసీలో రూ.571.92 కోట్లతో పథకాలు...

నగరపాలన శాఖ, తాగునీటి పంపిణీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో రూ.571.92 కోట్లతో పూర్తయిన 49 పథకాలను ప్రారంభించి, కొత్తగా చేపట్టనున్న 16 ప్రాజెక్టులకు స్టాలిన్ శంకుస్థాపన చేశారు. అంతే కాకుండా కార్పొరేషన్‌లో 50 వాహనాలను కూడా ప్రారంభించారు.

సౌలభ్య పాలనలో 10 సేవలు...

రాష్ట్ర ప్రభుత్వం సౌలభ్య పాలన (ఎలిమై ఆళుమై) పథకం కింద ప్రజలకు 10 రకాల సేవలను అందించనుంది. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ సేవలకు ముఖ్యమంత్రి స్టాలిన్ శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు 150 రకాల సేవలను ఇంటర్‌నెట్ లేదా ఆన్‌లైన్ ద్వారా అందిస్తోంది. ఈ నేపథ్యంలో కీలకమైన పది సేవలను ప్రజలకు వెంటనే అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రైతులవద్దకే వ్యవసాయ పథకాలు.

సచివాలయంలో జరిగిన మరొక కార్యక్రమంలో రాష్ట్రంలో రైతుల వద్దకే వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖల పథకాలు పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. ఆ మేరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిరువారూరు జిల్లా వలంగైమాన్ తాలూకా మాణిక్కమంగళం గ్రామంలో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా వ్యవసాయ శాఖ అధికారులు రైతుల వద్దకే వెళ్ళి వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి వివరించి వ్యవసాయానికి సంబంధించి తగు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. ప్రతి నెలా రెండో, నాలుగో శుక్రవారాలలో అధికారులు రైతు శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తారు.

ఈ కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు ఏవీ వేలు, పళనివేల్ త్యాగరాజన్, కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, తంగం తెన్నరసు, కయల్‌విళి సెల్వ రాజ్, జీసీసీ మేయర్ ఆర్.ప్రియ, కమిషనర్ కుమారగురుబరన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, రహదారులు మినీఓడరేవుల శాఖ కార్యదర్శి డాక్టర్ ఆర్.సెల్వరాజ్, చెన్నై కన్నియాకుమారి పారిశ్రామిక మార్గాల ప్రాజెక్టు డైరెక్టర్ డి.భాస్కరపాండ్యన్, రహదారుల శాఖ ప్రిన్సిపల్ డైరెక్టర్ ఇరా సెల్వదురై, నాబార్డ్ గ్రామీణ రహదారుల చీఫ్ ఇంజనీర్ పి.సెంథిల్, ప్రజాపనుల శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంగత్‌రామ్ శర్మ, ఆశాఖ చీఫ్ ఇంజనీర్ ఎస్. మణివన్నన్ తదితరులు పాల్గొన్నారు.

ముట్టుకాడులో కలైంజర్ ఇంటర్‌నేషనల్ కన్వెన్షన్ సెంటర్...

సచివాలయంలో ప్రజాపనుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో చెంగల్పట్టు జిల్లా ముట్టుకాడు వద్ద రూ.525 కోట్లతో నిర్మించనున్నట్లు కలైంజర్ ఇంటర్‌నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌కు స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. 37.99 ఎకరాల విస్తీర్ణంలో 10 వేల సీటింగ్ కెపాసిటీతో ఈ కేంద్రం ఏర్పాటవుతుందని ఆయన చెప్పారు.

- కౌన్సిల్ సమావేశంలో టెండర్ల విడుదలపై బాహాబాహి
- అన్నాడీఎంకే కార్పొరేటర్‌పై డీఎంకే కార్పొరేటర్ దాడి

సేలం కార్పొరేషన్‌లో రభస



సభాపక్షనాయకుడు యాదవమూర్తిపై దాడి చేస్తున్న డీఎంకే కార్పొరేటర్ సుహాసిని

చెన్నై, మే 29 (ఆంధ్రజ్యోతి): సేలం కార్పొరేషన్ సాధారణ సమావేశంలో అన్నాడీఎంకే సభాపక్షనాయకుడు యాదవమూర్తిపై డీఎంకే మహిళా కార్పొరేటర్ సుహాసిని దాడికి దిగారు. ఉన్నట్టుండి ఆయన చెంప ఛెళ్లుమనిపించారు. దీంతో ఆ సమావేశంలో ఉద్రిక్తత నెలకొంది. మేయర్ రామచంద్రన్ అధ్యక్షతన గురువారం ఉదయం సమావేశం ప్రారంభమైంది. డిప్యూటీ మేయర్ శారదాదేవి, కమిషనర్ డాక్టర్ ఇళంగోవన్, కార్పొరేటర్లు హాజరయ్యారు. సేలం నగరంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని, పలు వార్డులలో 12 రోజులకొకమారు మంచినీటిని సరఫరా చేస్తున్నారని డీఎంకే, అన్నాడీఎంకే కార్పొరేటర్లు పేర్కొన్నారు. తర్వాత అన్నాడీఎంకే సభాపక్ష నాయకుడు యాదవమూర్తి మాట్లాడుతూ వార్డుల్లో ఆయా డివిజన్ కార్పొరేటర్‌కు చెప్పకుండా అభివృద్ధిపనులు ప్రారంభించడం గర్హనీయమన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి తక్కువ ధరకే దాఖలైన టెండర్లను పట్టించుకోకుండా అధిక ధరకు టెండర్లు వేసిన అధికార పక్ష నాయకులకే పనులు అప్పగిస్తున్నారని ఆరోపించారు. దీంతో డీఎంకే కార్పొరేటర్లంతా మూకుమ్మడిగా లేచి యాదవమూర్తితో వాగ్వాదానికి దిగారు. అదే సమయంలో 45వ డివిజన్ కార్పొరేటర్ సుహాసిని ఆగ్రహంతో ఊగుతూ యాదవమూర్తిపై దాడి చేసి, అతడి చెంప ఛెళ్లుమనిపించారు. దీంతో వారిద్దరిని సర్దిచెప్పేందుకు కార్పొరేటర్లంతా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సభలో గందరగోళం చోటుచేసుకోవడంతో పోలీసులు సమావేశ మందిరంలోకి వచ్చి ఇరువర్గాలను శాంతింప చేయడానికి ప్రయత్నించారు. ఆ తర్వాత మరొక డీఎంకే కార్పొరేటర్ మురుగన్ కూడా యాదవమూర్తిని బలంగా నెట్టడంతో నేలపైపడ్డారు. ఆ తర్వాత డీఎంకే కార్పొరేటర్లు జోక్యం చేసుకుని మురుగన్, సుహాసిని సభ నుండి బయటకు లాక్కెళ్లారు. పరిస్థితి గ్రహించిన మేయర్ రామచంద్రన్ సభను అర్ధాంతరంగా వాయిదా వేసి వెళ్లిపోయారు. ఆ తర్వాత అన్నాడీఎంకే సభాపక్షనాయకుడు యాదవమూర్తి నాయకత్వంలో అన్నాడీఎంకే కార్పొరేటర్లు మేయర్ పీఠం ముందు బైఠాయించి నిరసన తెలిపారు.



సుహాసినిపై కఠిన చర్యలు తీసుకోవాలని యాదవమూర్తి నాయకత్వంలో మేయర్ సీటు వద్ద బైఠాయించిన అన్నాడీఎంకే కార్పొరేటర్లు

సమాచార దర్శిని

రేపు, 2న చెన్నై సెంట్రల్-గూడూరు సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-గూడూరు మార్గంలోని కవరపేట-గుమ్మిడిపూండి యార్డ్ మార్గంలో మరమ్మతుల కారణంగా శనివారం, జూన్ 2వ తేది ఉదయం 11.15 నుంచి మధ్యాహ్నం 3.15 గంటల వరకు 19 సబర్బన్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ సమయంలో ప్రయాణికుల సౌకర్యార్థం పొన్నేరి, మీంజూరు రైల్వేస్టేషన్ల నుంచి చెన్నై సెంట్రల్, చెన్నై బీచ్‌లకు ఆరు ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

1న చెన్నై బీచ్-చెంగల్పట్టు మధ్య సబర్బన్ రైళ్లు పాక్షిక రద్దు

రైలు మార్గాల్లో మరమ్మతుల కారణంగా జూన్ 1వ తేది చెన్నై బీచ్-చెంగల్పట్టు మార్గంలో సబర్బన్ రైళ్లు పాక్షికంగా రద్దు చేశారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... కాటాన్ కొళత్తూర్ మార్గంలో జూన్ 1వ తేది ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 3.15 గంటల వరకు మరమ్మతుపనులు చేపట్టనున్నారు. ఆ సమయంలో చెన్నై బీచ్ నుంచి చెంగల్పట్టుకు వెళ్లే సబర్బన్ రైళ్లు గుడువాంజేరి వరకు మాత్రమే నడుస్తాయని దక్షిణ రైల్వే తెలిపింది.

పశుసంవర్ధక శాఖలో వైద్యుల నియామకం

పెరంబూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వీధికుక్కలకు స్టెరిలైజేషన్ శస్త్రచికిత్స చేయడానికి 200 మంది పశు వైద్యులను నియమించినట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వీధికుక్కల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, పలు ప్రాంతాల్లో కుక్కలు ప్రజలపై దాడి చేస్తున్న ఘటనలు అధికమవుతున్నాయి.ఈసమస్య పరిష్కరించేలా వీధి కుక్కలకు శస్త్రచికిత్స నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దానికోసం 200 మంది పశు వైద్యులను నియమించామని, శస్త్రచికిత్సతో పాటు రాబిస్ టీకాలు కూడా వేయనున్నామని, జూన్ మొదటి వారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

మహిళలకు రూ.10 లక్షల వరకు రుణాలు

పెరంబూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చేలా తలా రూ.10 లక్షల వరకు రుణాలు అందించే పథకాన్ని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ అమలుచేస్తోంది. ఈ పథకంలో ఏడాదికి 20 వేల మంది చొప్పున ఐదేళ్లలో లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దనున్నామని ప్రకటించిన రాష్ట్రప్రభుత్వం, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.225 కోట్లు కేటాయించింది. రుణాల్లో 20 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించడంతో త్వరలోనే దరఖాస్తులు ఆహ్వానించి, లబ్దిదారులను ఎంపిక చేయనున్నామని అధికారులు తెలిపారు.

మార్కుల జాబితాలో సవరణలకు అవకాశం

పెరంబూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ, టెన్త్ విద్యార్థుల మార్కుల జాబితాలో సవరణలు చేపట్టేందుకు ప్రధానోపాధ్యాయులకు పరీక్ష శాఖ తుది అవకాశం కల్పించింది. ఈ మేరకు పరీక్ష శాఖ డైరెక్టర్ ఎన్.లత జిల్లా ప్రధాన విద్యాధికారులకు పంపిన ఉత్తర్వులో.. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో పరీక్షలు రాసిన టెన్త్, ప్లస్ టూ విద్యార్థుల పేరు, ఇతర వివరాలను కొన్ని పాఠశాలలు సక్రమంగా అందజేయలేదన్నారు. ప్రస్తుతం ఫలితాలు వెలువడి విద్యార్థులకు తాత్కాలిక మార్కుల జాబితా అందించామని తెలిపారు. మార్కుల జాబితాలో పేరు, పుట్టిన తేదీఫొటో సహా ఏవైనా సవరణలు ఉంటే, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మార్కుల జాబితా నకలు, సవరణలకు సంబంధించిన సర్టిఫికెట్లు జతచేసి జూన్ 13వ తేదిలోపు ప్రభుత్వ పరీక్షల జాయింట్ డైరెక్టర్ కార్యాలయానికి పంపించాలని సర్క్యులర్‌లో తెలియజేశారు.

ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ

పెరంబూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో ఒకేసారి మూడు నెలల ఉచిత బియ్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని రేషన్ దుకాణాల ద్వారా 2.21 లక్షల బియ్యం రేషన్ కార్డులకు ప్రతినెలా ఉచిత బియ్యం అందజేస్తున్నారు. వాటిలో 1.11 కోట్ల ప్రాధాన్యత, అంత్యోదయ కార్డులకు 2.05లక్షల టన్నుల బియ్యం, 8,576 టన్నుల గోధుమలు రాష్ట్రానికి ఉచితంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది.దేశవ్యాప్తంగా గత సీజన్‌లో రైతులనుంచి బియ్యం, గోధుమలు అధికంగా కొనుగోలు చేయడంతో, గోదాముల నిల్వలు పేరుకుపోయాయి. అందువల్ల ప్రాధాన్యత, అంత్యోదయం కార్డులకు వచ్చే జూన్, జూలై, ఆగస్టు నెలల బియ్యం, గోధుమలు ఒకేసారి అందించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో, మూడు నెలల బియ్యం ఒకేసారి అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బియ్యం జూన్ లేదా జూలై అందించాలా అనే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు అధికారవర్గాల సమాచారం.

మేట్టూరు డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): కావేరి నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా సేలం జిల్లా మేట్టూరు డ్యాంలో నీటి ప్రవాహం పెరిగింది. బుధవారం డ్యాంకు 4,070 ఘనపుటడుగులుగా వస్తున్న నీరు, గురువారం 4,927 ఘనపుటడుగులకు పెరిగింది. తాగునీటి అవసరాలకు డ్యాం నుంచి 1,000 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 112.18 అడుగులు (పూర్తి సామర్థ్యం 120 అడుగులు) చొప్పున 81.55 టీఎంసీల నీటి నిల్వలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

ప్రభుత్వ ఆర్థిక సంఘం ఏర్పాటు

ప్యారీస్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం 7వ ఆర్థిక సంఘాన్ని నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. 2026వ సంవత్సరం ఆగస్టు 31వ తేదీలోగా ఈ సంఘం తన నివేదిక అందజేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఆర్థిక సంఘం రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి పట్టణ, గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితిని పరిశీలించి సమగ్ర వివరాలతో నివేదిక తయారు చేస్తుంది. రాష్ట్రప్రభుత్వం నియమించిన 7వ ఆర్థిక సంఘ అధ్యక్షుడిగా రిటైర్డ్ జిల్లా కలెక్టర్ కె.అల్లావుద్దీన్ వ్యవహరిస్తారు. సభ్యులుగా తిరుప్పూర్ కార్పొరేషన్ మేయర్ ఎన్.దినేష్‌కుమార్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నిర్వాహక డైరెక్టర్, గ్రామీణ అభివృద్ధి కమిషనర్, పంచాయతీల కమిషనర్, ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి నియమితులయ్యారు. 2027, ఏప్రిల్ 1 నుండి ప్రారంభమయ్యే 5ఏళ్లకు వర్తించేలా ఈ సంఘం వచ్చే ఏడాది ఆగస్టు 31వ తేదీలోగా తన నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తుందని సచివాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

సహకార బ్యాంకులకు ఆర్బీఐ నిబంధనలు వర్తించవు

● మంత్రి పెరియకరుప్పన్

ప్యారీస్, మే 29 (ఆంధ్రజ్యోతి): రిజర్వ్ బ్యాంక్ తాజాగా ప్రకటించిన నిబంధనలు రాష్ట్ర సహకార బ్యాంకులకు వర్తించవని మంత్రి పెరియకరుప్పన్ స్పష్టం చేశారు. సచివాలయంలో గురువారం ఉదయం సహకార శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చర్చించిన కీలక అంశాలను మంత్రి మీడియాకు వివరించారు. ఆర్బీఐ తాజాగా ప్రకటించిన నిబంధనలు రాష్ట్ర సహకార బ్యాంకులకు వర్తించవని ఆ నిబంధనల వల్ల సహకార శాఖకు ఎలాంటి నష్టం కలగదన్నారు. అసెంబ్లీలో ఈ ఏడాదికి సంబంధించిన సహకార శాఖ తరుపున ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రకటించిన 49 కొత్త ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. మెరీనా బీచ్ రోడ్డులోని వార్ మెమోరియల్ సమీపంలోవున్న ప్రభుత్వ స్థలంలో సహకారశాఖ ఆధ్వర్యంలో మల్టీలెవల్ బిల్డింగ్ నిర్మించి, అందులో సహకార బ్యాంకు, చౌక దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సహకార బ్యాంకుల్లో సభ్యత్వం ఉన్న వారికి తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతులకు పంట రుణాలు మాత్రమే కాకుండా వ్యవసాయానికి సంబంధించిన పశువుల కొనుగోలుకు రుణాలు అందించేలా ఈ సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు 12వేల మందికి సహకారశాఖలో ఉద్యోగాలు కల్పించామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సహకారశాఖ ఆధ్వర్యంలో 60పెట్రోల్ బంకులు పనిచేస్తున్న నేపథ్యంలో, ప్రస్తుతం అదనంగా మరో 40 బంకుల ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి పెరియకరుప్పన్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెరియకరుప్పన్

పొల్లాచ్చి బాధితులకు తలా రూ.25 లక్షలు

పెరంబూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): పొల్లాచ్చి ఘటనకు సంబంధించి బాధిత మహిళల బ్యాంక్ ఖాతాల్లో తలా రూ.25 లక్షలు జమచేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలోనే సంచలనం రేపిన పొల్లాచ్చి అత్యాచార ఘటనలో 9 మంది నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ కోవై మహిళా న్యాయస్థానం ఇటీవల తీర్పు వెలువరించింది. అలాగే, బాధిత మహిళలు 8 మందిలో ఏడుగురికి రూ.85 లక్షలు అందజేయాలని న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. బాధిత 8 మందిలో ఓ మహిళ చివరి వరకు సాక్ష్యం చెప్పేందుకు రాకపోవడంతో, ఆమె మినహా మిగిలిన వారికి నగదు అందజేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ క్రమంలో, పొల్లాచ్చి ఘటనలో బాధిత మహిళలకు తలా రూ.25 లక్షలు అందజేస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఆ ప్రకారం, సీఎం ప్రకటించిన 15 రోజుల్లోపే బాధిత మహిళల బ్యాంక్ ఖాతాల్లో తలా రూ.25 లక్షలు జమచేసినట్లు, న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు రూ.85 లక్షల పరిహారం త్వరలో అందజేస్తామని ప్రభుత్వం తెలియజేసింది.

బస్సు ఛార్జీల పెంపు...?

● ప్రజాభిప్రాయం సేకరిస్తున్న రవాణా శాఖ

పెరంబూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): బస్సు ఛార్జీల పెంపుపై ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయాలని రాష్ట్ర రవాణా శాఖ కోరింది. 2018లో ప్రభుత్వ బస్సు ఛార్జీలు పెంచారు. అనంతరం డీజిల్, విడిభాగాల ధరల పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వ బస్సు ఛార్జీల్లో మార్పులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, ఛార్జీల పెంపుపై ప్రజాభిప్రాయాలు సేకరించనున్నారు. ఈ విషయమై రవాణా శాఖ కమిషనర్ విడుదల చేసిన ప్రకటనలో... ప్రైవేటు బస్సు యజమానుల సంఘం, చెన్నై, ఈరోడ్ బస్సుల యజమానుల సంఘం ఛార్జీల పెంపు కోరుతూ దాఖలుచేసిన పిటిషన్‌లో హైకోర్టు తీర్పును ప్రస్తావించారు. ఆ ప్రకారం, రవాణా శాఖ కమిషనర్ అధ్యక్షతన నిపుణుల కమిటీ నియమించిన ప్రభుత్వం, బస్సు ఛార్జీల పెంపుపై అధ్యయనం చేసి నివేదిక అందజేయాలని ఆదేశించింది. అలాగే, ఛార్జీల పెంపుపై ప్రజలు అభిప్రాయాలు తెలపాలని కోరారు. గిండిలో ఉన్న రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో నేరుగా గాని, పోస్టు ద్వారా 'రవాణా శాఖ కమిషనర్, గిండి, చెన్నై-600032'అనే చిరునామా, tc.tn@nic.in అనే ఈ-మెయిల్‌లో మూడు వారాల్లో తమ అభిప్రాయాలు తెలియజేయాలని రవాణా శాఖ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

11 మున్సిపాలిటీల స్థాయి పెంపు

● జీవో జారీ చేసిన సర్కారు

అడయార్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 11 మున్సిపాలిటీల స్థాయి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీటిలో పళని, మాంగాడు, కుండ్రత్తూరు, నందివరం - గూడువాంజేరి సహా మొత్తం 11 మున్సిపాలిటీలున్నాయి. గత అసెంబ్లీ సమావేశాల సమయంలో తిరుచెంగోడు, ఉడుమలైపేట, పళని మున్సిపాలిటీలను స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలుగా, నందివరం - గూడువాంజేరి, పల్లడం, రామేశ్వరం మున్సిపాలిటీలు సెలక్షన్ గ్రేడ్ పురపాలక సంస్థలుగా, మాంగాడు, కుండ్రత్తూరు, అరియలూరు, వెల్లకోయిల్, అంబాసముద్రం మున్సిపాలిటీలను ఫస్ట్‌గ్రేడ్ పురపాలక సంస్థలుగా స్థాయి పెంచుతామని రాష్ట్ర పురపాలక శాఖామంత్రి కేఎన్ నెహ్రూ ప్రకటించారు. అందుకు అనుగుణంగా మొత్తం 11 పురపాలక సంస్థల స్థాయి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్టు రాష్ట్ర మున్సిపాలిటీ మంత్రిత్వ శాఖ ముఖ్య కార్యదర్శి కార్తికేయన్ విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.

కట్టికుళం జల్లికట్టులో 20 మందికి గాయాలు



ఎద్దును అదుపుచేస్తున్న యువకుడు

పెరంబూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా కట్టికుళంలో నిర్వహించిన జల్లికట్టు పోటీల్లో 20 మందికి గాయాలయ్యాయి. కట్టికుళం తిరువెట్టై అయ్యనార్ ఆలయ వేడుకల సందర్భంగా జిల్లా యంత్రాంగం, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో బుధవారం జల్లికట్టు పోటీలు జరిగాయి. ముందుగా పోటీలో పాల్గొనే యువకులు, ఎద్దుల యజమానులచే ప్రతిజ్ఞ చేయించాడు. పోటీల్లో శివగంగ, రామనాథపురం, విరుదునగర్, మదురై, పుదుకోట, దిండుగల్ తదితర జిల్లాలకు చెందిన సుమారు 700 ఎద్దులను రౌండ్ల వారీగా వడివాసల్ నుంచి బరిలో దింపారు. ఎద్దులు అదుపుచేసేందుకు 300 మందికి పైగా యువకులు పోటీపడ్డారు. ఈ పోటీల్లో 20 మంది యువకులకు గాయాలు కాగా, ఆ ప్రాంతంలోనే ఏర్పాటుచేసి వైద్య శిబిరంలో చికిత్స అందించారు. ఎక్కువ ఎద్దులు అదుపుచేసిన యువకులకు, యువకులకు చిక్కకుండా వెళ్లిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలు చూసేందుకు శివగంగ సహా పలు జిల్లాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చారు.

పురుషులు మాత్రమే పాల్గొనే ఆలయ వేడుకలు

పెరంబూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా నరికుడి మాసానం స్వామి ఆలయ వేడుకల్లో పురుషులు మాత్రమే పాల్గొని విందు భోజనం చేశారు. ఆలయ వైకాశి వేడుకల్లో భాగంగా బుధవారం ముందయమ్మన్ ఆలయం నుంచి భక్తులు ఊరేగింపుగా మాసా నం, అరియస్వామి ఆలయాల మీదుగా వీరభద్రస్వామి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం పొంగళ్లు పెట్టి స్వామివార్లకు నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. అనంతరం భక్తులు కానుకగా అందజేసిన వందకి పైగా గొర్రెలు, మేకలు, 200లకు పైగా కోళ్లను బలిచ్చారు. అనంతరం మాంసాహారం వండి, పురుషులంతా నేల మీద కూర్చొని విందు భోజనం చేశారు. మిగిలిన వంటకాలను ఇళ్లకు తీసుకువెళ్లకూడదని, అక్కడే గుంత తీసి పూడ్చివేశారు.



విందు భోజనంలో పురుషులు

చోరీకి గురైన ఒంటె స్వాధీనం

● పోషణ కష్టమంటూ వదిలివెళ్లిన దొంగ



ఒంటెతో విజయ్, కుటుంబ సభ్యులు

పెరంబూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): చోరీకి గురైన ఒంటను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కరూర్ జిల్లా కుందిరమణిపాళయం నత్తమేడు ప్రాంతానికి చెందిన విజయ్, తన కుటుంబంతో కలసి సర్కస్ నడుపుతున్నాడు. సర్కస్‌లో విన్యాసాలు చేసేందుకు కుక్కలు, గుర్రం, ఒంటె సహా పలురకాల జంతువులను పెంచుతున్నాడు. ఈ క్రమంలో, తంజావూరు వస్తాచావిడి ప్రాంతంలో గుడారం వేసుకుని సర్కస్ నిర్వహిస్తుండగా, ఈ నెల 15వ తేది రాత్రి ఒంటె కనిపించకుండా పోయింది. దీంతో, విజయ్ తంజావూరు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, వారు కేసు నమోదుచేసి ఒంటె కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో, తంజావూరు సమీపం రెడ్డిపాళయంలోని ఓ చెట్టు కింద ఒంటె కట్టివేసి ఉందని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడకు చేరుకుని ఒంటెను స్వాధీనం చేసుకున్నారు. ఒంటెను తీసుకెళ్లిన దొంగ, దానిని పోషించలేక వదిలివెళ్లినట్లు ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు, బుధవారం ఒంటెను విజయ్‌కు అప్పగించారు.

రూ.3.45 కోట్లతో కాళికాంబాళ్ ఆలయానికి రథం

చెన్నై, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్యారీస్ కార్నర్ తంబుశెట్టి వీధిలోని కాళికాంబాళ్ ఆలయంలో రూ.3.45 కోట్లతో 292 కేజీల బరువుతో చేయించిన వెండి రథం ట్రయల్ రన్‌ను దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాళికాంబాళ్ కమటేశ్వర దేవస్థానం ట్రస్టుబోర్డు ఛైర్మన్ ఈఎంఎస్ మోహనాచారి, సభ్యులు ఎస్.సర్వేశ్వరన్, వి.శీనివాసన్, ఇరా రాజేంద్రకుమార్, జే రమేష్, దేవాదాయ శాఖ కమిషనర్ హరిహరన్,తదితరులు పాల్గొన్నారు.



వెండి రథం ట్రయల్‌రన్ ప్రారంభిస్తున్న దేవాదాయ శాఖమంత్రి పీకే శేఖర్‌బాబు

చివరి నిమిషంలో వివాహానికి నిరాకరణ

● పీటల మీదే ఆగిపోయిన పెళ్లి

అడయార్, మే 29 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా ఆండిపట్టిలో వధువు చివరి నిమిషంలో పెళ్లికి నిరాకరించింది. దీంతో పీటలపై పెళ్లి ఆగిపోయింది. ఆండిపట్టికి చెందిన ఒక యువకుడు అమెరికాలో పనిచేస్తున్నాడు. అతడికి పుదుచ్చేరికి చెందిన యువతితో వివాహం చేసేందుకు ఇరు కుటుంబాల పెద్దలు నిర్ణయించారు. వీరి వివాహం బుధవారం జరగాల్సివుంది. ఇందుకోసం వధూవరులు, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులంతా కల్యాణ మండపానికి చేరుకున్నారు. బుధవారం ఉదయం ముహూర్తం సమయానికి వధూవరులను పెళ్లి పీటలపై కూర్చోబెట్టి, పెళ్ళితంతును పూజారి ప్రారంభించాడు. ఇంతలో తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని వధువు మొండికేసింది. మెడలో ఉన్న మాలలు తీసి పెళ్ళి మండపంలో పడేసి వధువు గదికి వెళ్ళిపోయింది. దీంతో ఇరు కుటుంబ సభ్యులతో పాటు బంధు మిత్రులంతా ఆశ్చర్యపోయారు. వధువుకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో వరుడు కుటుంబ సభ్యుల డిమాండ్ మేరకు పెళ్ళి ఖర్చుల్లో కొంత మొత్తాన్ని వధువు తల్లిదండ్రులు చెల్లించడంతో ఈ పెళ్ళి వివాదం సమసిపోయింది.

బక్రీద్ ఎఫెక్ట్: అయ్యలూరు సంతలో రూ.కోట్లలో పొట్టేళ్ల విక్రయాలు

చెన్నై, మే 29 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా అయ్యలూరు సంతలో గురువారం ఉదయం బక్రీద్ పండుగను పురస్కరించుకుని రూ.3 కోట్ల మేర పొట్టేళ్ల అమ్మకాలు జరిగాయి. అయ్యలూరు ప్రతి గురువారం మేకల సంత నిర్వహిస్తారు. ఈ నెల 7న ముస్లిం బక్రీద్ పండుగ జరుపుకోనుండటంతో ఈ సంత లో గురువారం వేకువజాము వ్యాపారులు వేల సంఖ్యలో పొట్టేళ్లను తీసుకొచ్చారు. ఆ సందర్భంగా రూ.20 వేల నుండి రూ.30వేలకు పొట్టేళ్ళ అమ్మకాలు జోరుగా సాగాయి. పది కేజీల బరువున్న మేకను రూ.7500 నుండి రూ.8000లకు విక్రయించారు. ఇదే విధంగా నాటుకోళ్లు కూడా విపరీతంగా అమ్ముడయ్యాయి. ఉదయం పది గంటల కల్లా ఆ సంతలో రూ.3 కోట్ల మేరకు పొట్టేళ్ల అమ్మకాలు జరిగిన వ్యాపారులు ప్రకటించారు.



అయ్యలూరు సంతలో జోరుగా సాగుతున్న పొట్టేళ్ల అమ్మకాలు

7న బక్రీద్ పండుగ

పెరంబూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నెలవంక కనిపించడంతో జూన్ 7వ తేది బక్రీద్ పండుగ జరుపుకోవాలని ప్రకటించారు. ఈ మేరకు తమిళనాడు తౌహీద్ జమాత్ రాష్ట్ర ప్రధాన కార్యాలయ ప్రధాన ఖాజీ కైసర్ విడుదల చేసిన ప్రకటనలో.. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బుధవారం నెలవంక కనిపించిందన్నారు. దీని ఆధారంగా, 6వ తేది శుక్రవారం అరఫా ఉపవాసం, 7వ తేది శనివారం హజ్ పండుగ (బక్రీద్) ఉంటుందని ఖాజీ తెలిపారు.

బస్సులో హవాలా నగదు స్వాధీనం

పెరంబూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బస్సులో రూ.20 లక్షల హవాలా నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తిరువారూరు జిల్లా నన్నిలం ప్రాంతంలో పేరలం సీఐ సుగణ నేతృత్వంలో పోలీసులు బుధవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో తిరువారూరు నుంచి మైలాగుదురై వెళ్తున్న ప్రభుత్వ బస్సును ఆపి తనిఖీ చేశారు. ప్రయాణికుల్లో ఒక వ్యక్తిని అనుమానించిన పోలీసులు, అతడి బ్యాగు తనిఖీ చేయగా రూ.20 లక్షలు బయటపడ్డాయి. ఈ నగదుకు ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్న పోలీసులు, బ్యాగు తీసుకెళ్తున్న మైలాడుదురై జిల్లా పదనల్లూర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ యూనిస్(40)ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

వివాహ వేడుకలో నృత్యం చేస్తూ యువకుడి మృతి

పెరంబూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): వివాహ రిసెప్షన్‌లో స్నేహితులతో కలసి నృత్యం చేస్తున్న యువకుడు హఠాత్తుగా మృతిచెందిన ఘటన విషాదం నింపింది. న్యూ వాషర్‌మెన్‌పేట అశోక్ నగర్‌కు చెందిన సుభాష్ చంద్రబోస్ (27) విద్యుత్ బోర్డులో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి సుభాష్, తండయార్‌పేటలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన స్నేహితుడి వివాహ రిసెప్షన్‌కు వెళ్లాడు. రిసెప్షన్‌లో డీజే పాటలకు స్నేహితులతో కలసి సరదాగా నృత్యం చేస్తున్న సుభాష్ హఠాత్తుగా కిందపడి స్పృహ తప్పాడు. స్నేహితులు అతడిని వెంటనే సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు, అప్పటికే అతడు మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై న్యూ వాషర్‌మెన్‌పేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రేమను నిరాకరించిందని విద్యార్థిని దారుణ హత్య

పెరంబూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రేమ నిరాకరించిందంటూ విద్యార్థినిని దారుణంగా హతమార్చిన ఘటన రాణిపేట జిల్లాలో బుధవారం రాత్రి జరిగింది. షోలింగర్ సమీపం పులివల గ్రామానికి చెందిన జగత్‌కుమార్ కుమార్తె జనని (15) 10వ తరగతి చదువుతోంది. వేసవి సెలవులు కావడంతో, జగత్‌కుమార్ అక్క కుమార్తె లక్ష్య (16)తో కలసి జనని బామ్మ ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలో, బుధవారం రాత్రి ఇంట్లో ప్రవేశించిన ఓ యువకుడు తలుపులు మూసివేసి, కత్తితో జననిపై తీవ్రంగా దాడిచేశాడు. అతడిని అడ్డుకొనేందుకు యత్నించిన లక్ష్యపై కూడా దాడి చేశాడు. వారి కేకలకు చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని తలుపులు బద్దలుకొట్టి లోనికి వెళ్లగా జనని, లక్ష్య రక్తపు మడుగుల్లో పడి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందారు. ఈ ఘటనలో తీవ్రగాయాలతో జనని ఘటనా స్థలంలోనే మృతిచెందింది. అలాగే, గాయపడిన లక్ష్యను సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో, ఇంట్లో కత్తితో నిలబడి తప్పించుకునేందుకు యత్నించిన యువకుడిని ప్రజలు చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో... తిరువళ్లూర్ జిల్లా కేజీ కండిగై ప్రాంతానికి చెందిన సుబ్రమణి (21) అని, అతను పలుమార్లు తనను ప్రేమించాలంటూ జననిని వేధించేవాడని, అందుకు ఆమె నిరాకరించడంతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలిసింది.

కణితిని తొలగించబోయి 'సున్తీ' శస్త్రచికిత్స

● వైద్యుడిపై కేసు

పెరంబూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): పెదవిపై ఉన్న కణితిని తొలగించేందుకు బదులు 'సున్తీ' శస్త్రచికిత్స చేసిన వైద్యుడిపై పోలీసులు కేసు నమోదుచేశారు. స్థానిక ఐస్ హౌస్ ప్రాంతానికి చెందిన 9 ఏళ్ల బాలుడు పెదవిపై వచ్చిన కణితితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం ఐస్ హౌస్ బీసెంట్ రోడ్డులోని ప్రైవేటు ఆసుపత్రికి ఈ నెల 22న కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. అక్కడ కణితిని తొలగించాల్సి వైద్యుడు సున్తీ శస్త్రచికిత్స చేశాడు. దీంతో, దిగ్భ్రాంతి చెందిన తల్లిదండ్రులు శస్త్రచికిత్స చేసిన వైద్యుడిపై ఐస్ హౌస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు నమోదుచేసిన పోలీసులు డాక్టర్‌ను విచారిస్తున్నారు.

డీఎంకే నుండి మదురై మేయర్ భర్త సస్పెన్షన్

ప్యారీస్, మే 29 (ఆంధ్రజ్యోతి): మదురై కార్పొరేషన్ మేయర్ ఇంద్రాణి భర్త పొన్‌వసంత్‌ను డీఎంకే నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ మంత్రి దురైమురుగన్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. మదురై మహానగర 57వ వార్డుకు చెందిన డీఎంకే నాయకుడు పొన్‌వసంత్ పార్టీ నిబంధనలను ఉల్లంఘించాడని, పార్టీ పేరుప్రతిష్ఠలకు భంగం కలిగించేలా వ్యవహరించిన కారణంగా ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మంత్రి దురైమురుగన్ ఆ ప్రకటనలో తెలిపారు.

శక్తివంతమైన పురాతన బాంబు గుర్తింపు




మొదటి ప్రపంచ యుద్ధం నాటి బాంబు

అడయార్, మే 29 (ఆంధ్రజ్యోతి): మొదటి ప్రపంచ యుద్ధంలో ఉపయోగించిన శక్తివంతమైన బాంబును ఎర్నావూరు ప్రాంతంలో గుర్తించారు. ఎర్నావూరు రామకృష్ణ నగర్ 5వ వీధికి చెందిన ముస్తాఫా అనే వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం రెండు రోజుల క్రితం పునాదులు తవ్వగా అందులో ఒక బాంబు వెలుగు చూసింది. ఇది సుమారుగా 2 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పు వుంది. దీన్ని చూడగానే ముస్తాఫాతో పాటు స్థానికులు భయభ్రాంతులకు గురై పోలీసులకు సమాచారమివ్వగా, ఎన్నూరు, ఆవడి పోలీసులు, బాంబు స్క్వాడ్ వెళ్లి బాంబును స్వాధీనం చేసుకుంది. ఈ బాంబు తొలి ప్రపంచ యుద్ధం సమయంలో 1914 సెప్టెంబరు 22వ తేదీ కెప్టెన్ వాన్ ముల్లర్ సారథ్యంలోని ఎమ్‌డన్ నౌకలో వచ్చిన జర్మనీ సైనికులు చెన్నై నగరంపై దాడి చేసేందుకు ప్రయోగించినట్టు గుర్తించారు. ఆ తర్వాత కోర్టు అనుమతితో సడైయంకుప్పం ప్రాంతానికి బాంబును తరలించి నిర్వీర్యం చేశారు.

బైకు ప్రమాదంలో విద్యార్థి మృతి

అడయార్, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసెంట్ నగర్‌లో ద్విచక్రవాహనం చెట్టును ఢీకొనడంతో కాలేజీ విద్యార్థి మృతి చెందగా మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. అడయార్ ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. నెర్కుంద్రం శక్తి నగర్‌కు చెందిన కిషన్ (18) అనే విద్యార్థి నగరంలోని ఓ కాలేజీలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితుడు అక్షయ్ తమిళరసన్ (16)తో కలిసి బీసెంట్ నగర్ బీచ్‌కు బైకులో వెళ్ళాడు. కిషన్ వేగంగా బైకు నడపడంతో స్పీడ్ బ్రేకర్ వద్ద బైకు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిషన్ అక్కడే ప్రాణాలు కోల్పోగా, అక్షయ్ తీవ్రంగా గాయపడ్డాడు. అడయార్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

విద్యార్థులకు 'మల్లర్ కంభ' శిక్షణ



మల్లర్ కంభపై విన్యాసాలు

పెరంబూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా అమెచ్యూర్ మల్లర్ కంభం సంఘం ఆధ్వర్యంలో మల్లర్ కంభ వేసవి శిక్షణలో విద్యార్థులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామాల్లో ఆలయాల వేడుకల్లో మల్లర్ కంభం కార్యక్రమం నిర్వహిస్తుంటారు. ఎత్తుగా స్తంభంలా ఉంటే కొయ్యకు పూర్తిగా నూనె పూసి, యువకులు ఒకరిపై ఒకరు ఎక్కుతూ స్తంభం చివరన ఉంచిన వస్తువులు తీసుకుంటారు. అలా, వస్తువు తీసుకున్న బృందాన్ని విజేతగా ప్రకటించి బహుమతులు అందజేస్తుంటారు. ఇలాంటి వేడుకల్లో గ్రామాలకు చెందిన బృందాలు పాల్గొంటాయి. ఈ నేపథ్యంలో, అమెచ్యూర్ మల్లర్ కంభం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణకు విద్యార్థులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్తంభంపై వారు చేసిన విన్యాసాలను ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



జీసీసీ సహా పలు కార్పొరేషన్లలో నిర్మించిన పాఠశాలలు, తదితర భవనాలను సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్



కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చి సమీపం నెగమం వద్ద రహదారి పై కూలిపడిన చెట్టును తొలగిస్తున్న కార్మికులు



గూడలూరు రహదారిలో కూలిపడిన చెట్టును తొలగిస్తున్న రాష్ట్ర విపత్తుల నిర్వహణ బృందం

ప్రియా భవానీ శంకర్ ఏక్కడ?

గత యేడాది క్రితం వరుస చిత్రాల్లో నటించిన హీరోయిన్ ప్రియా భవానీ శంకర్... గత కొన్ని రోజులుగా కనిపించడం లేదు. దీంతో ఆమె ఏమైపోయారోనని కోలీవుడ్‌లో చర్చసాగుతోంది. గత యేడాది విడుదలైన 'డిమాంటీ కాలనీ-2'లో ఆమె నటించారు. ఆ తర్వాత ఆమె ఒక్క కొత్త చిత్రానికి కమిట్ కాలేదు కదా ఏ సినిమా కార్యక్రమంలో కూడా పాల్గొనలేదు. ఆమె తన ప్రియుడిని వివాహం చేసుకుని విదేశాల్లో స్థిరపడిపోయారనే టాక్ ఉంది. అదే సమయంలో ఆమె అభిమానులు మాత్రం ప్రియా భవానీ శంకర్‌కు ఏమైందంటూ వాకబు చేస్తున్నారు. ఆస్ట్రేలియాలో ఉన్న తన ప్రియుడిని చూసేందుకు వెళ్ళారని కొందరు అంటుంటే మరి కొందరు మాత్రం ఆమె పెళ్ళి చేసుకుని స్థిరపడిపోయారని మరికొందరు అంటున్నారు.



48 గంటల్లో తెరకెక్కనున్న 'డెవిలన్'

'డెవిలన్' అనే పేరుతో ఒక చిత్రాన్ని కేవలం 48 గంటల్లో తెరకెక్కించనున్నారు. ఈ సినిమా షూటింగ్ మే 29,గురువారం సాయంత్రం 3 గంటలకు ప్రారంభించి 31వ తేదీ, శనివారం సాయంత్రం 3 గంటలకు పూర్తి చేయనున్నారు. సినీ ఇండస్ట్రీలో ఇప్పటివరకు ఎవరూ చేయని సాహసాన్ని తాము చేసేందుకు సిద్ధమైనట్టు చిత్ర దర్శకుడు బిగ్గీ అరుణ్, నిర్మాత, హీరో రాజ్‌కుమార్ వెల్లడించారు. నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారితో పాటు చిత్ర బృందం పాల్గొన్నారు. ఇందులో రాజ్‌కుమార్, అరుణ్ మాట్లాడుతూ, ' నేటి కాలంలో చిత్రాన్ని నిర్మించడం కంటే దాన్ని వ్యాపారం చేసి, విడుదల చేయడం సవాల్‌గా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో మా సినిమా షూటింగ్ కేవలం 48 గంటల్లో పూర్తి చేసేందుకు శ్రీకారం చుట్టడం ఒక పెద్ద సాహసంతో కూడుకున్న పని. తాము తలపెట్టిన పని విజయవంతంగా పూర్తి చేస్తే నోబెల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటుదక్కుతుంది. ఈ ప్రాజెక్టు కోసం పలు కోణాల్లో పరిశోధన చేశాం. 48 గంటల్లో ఒక సినిమా చిత్రీకరణ పూర్తి చేయడం అసాధ్యం. అయినా సరే పూర్తి చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాం. ఇందులో హీరోయిన్లుగా కార్తిక, ఇందిర నటిస్తుండగా, ఫ్రెడ్రిక్, ఆనంది విజయకుమార్, బాలనటుడు డోరత్తి ఎస్‌జే గిరుదేవ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.


'డెవిలన్' హీరోయిన్లు కార్తిక, ఇందిర

చిత్రజ్యోతి

'హరిహర వీరమల్లు'లో నిధి హీరోయిన్ కాదు : సత్యరాజ్

పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడుగా నటిస్తున్న 'హరిహర వీరమల్లు' సినిమాలో హీరోయిన్ నిధి అగర్వాల్ కాదని తానేనని సీనియర్ నటుడు సత్యరాజ్ అన్నారు. ఏఎం జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఆస్కార్ అవార్డు గ్రహీత ఎంఎం కీరవాణి సంగీత దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా జూన్ 12వ తేదీ విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసింది. నగరంలో జరిగిన మీడియా సమావేశంలో నిర్మాత ఏఎం రత్నం, దర్శకుడు జ్యోతికృష్ణ, హీరోయిన్ నిధి అగర్వాల్, నటుడు సత్యరాజ్, సంగీత దర్శకుడు జ్యోతికృష్ణ, నటులు నాజర్, రెడిన్ కింగ్స్లీ, దర్శకుడు కేఎస్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. నటుడు సత్యరాజ్ మాట్లాడుతూ, 'సినిమా ఇండస్ట్రీ నుంచి ముఖ్యమంత్రులుగా ఎంజీఆర్, ఎన్టీఆర్ ఉన్నారని, ఇపుడు ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఈ మూవీలో హీరోయిన్ నిధి అగర్వాల్ కాదు. నేను. సాధారణంగా హీరో.. హీరోయిన్‌ను రక్షిస్తాడు. అలా అనుకుంటే ఈ చిత్రంలో నన్ను కాపాడేందుకు హీరో వస్తాడు. ఆ ప్రకారంగా చూస్తే హీరోయిన్ నేను' అని సరదాగా అన్నారు. 'సినిమాపై ఫ్యాషన్ కలిగిన నిర్మాత రత్నం కోసం ఈ సినిమా ఘన విజయం సాధించాలి' అని హీరోయిన్ నిధి అగర్వాల్ ఆకాంక్షించారు. సంగీత దర్శకుడు కీరవాణి మాట్లాడుతూ, 'ఈ ప్రపంచంలో కోప్పడని ఇద్దరు వ్యక్తులను చూశాను. వారిలో ఒకరు గాయని చిత్ర. రెండో వ్యక్తి ఏఎం. రత్నం. ఏం జరిగినా వీరిద్దరూ మాత్రం ప్రశాంతంగా ఉంటారు. అందుకే ఈ చిత్రానికి నిజమైన హీరో ఏఎం రత్నం అని అన్నారు. నిర్మాత ఏఎం. రత్నం మాట్లాడుతూ, 'ఇందులో సత్యరాజ్ పోషించిన పాత్ర చిన్నదే అయినా ఎంతో కీలకం. నా మూవీకి కీరవాణి సంగీతం సమకూర్చడం సంతోషంగా ఉంది. టెక్నికల్‌గా పవన్‌కు అనేక విషయాలు తెలుసు. అందుకు ఆయన డిప్యూటీ సీఎంగా ఉన్నప్పటికీ సినిమా నిర్మాణంలో ఎక్కడా కాంప్రమైజ్ కావడం లేదన్నారు. దర్శకుడు జ్యోతికృష్ణ మాట్లాడుతూ, 'ఈ ప్రాజెక్టు చేపట్టిన సమయంలో ఇది ఇంత భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా వస్తుందని భావించలేదు. ఈ సినిమా స్టోరీ 16వ శతాబ్దికి మొఘలాయ్ చక్రవరి ఔరంగజేబు కాలంలో జరిగే కథ. బాబీ డియోల్ ఔరంగజేబుగా నటించారు. ఈ కథ సిద్ధం చేసిన రెండేళ్ళ తర్వాత పవన్ డిప్యూటీ సీఎం అయ్యారు. తిరుమల ఘటన తర్వాత ఆయన సనాతన ధర్మాన్ని నెత్తికెత్తుకున్నారు. ఈ మూవీ కూడా సనాతన ధర్మానికి చెందినదే' అని వివరించారు.


మీడియా సమావేశంలో పాల్గొన్న చిత్ర బృందం

ఇంద్రుడికి శాపవిమోచన

సుక్షేత్రం శుచీంద్రం!

ఆధ్యాత్మికం

- వివాహయోగ్యం కలిగించే దివ్యక్షేత్రం
- సప్తస్వరాలు పలికే రాతిస్తంభాలకు నెలవు

దక్షిణ భారతంలో తమిళనాడు రాష్ట్రం ఆలయాలకు నిలయం. ఆధ్యాత్మికతకు ఆలంబన. ఎన్నో పురాణగాధలతో, పలు చారిత్రకాంశాలతో, శిల్ప, చిత్రకళల సమాహారంగా ఈ దేవాలయాలు విలసిల్లుతున్నాయి. పౌరాణికులు, చారిత్రకులు, పర్యాటకులు ఇలా వివిధ వర్గాలకు చెందిన వారెందరో ఆలయాల సందర్శనకు ఆసక్తి చూపిస్తారంటే అతిశయోక్తి కాదు. పౌరాణికగాథలతో ముడిపడిన 'శుచీంద్రం' పుణ్యక్షేత్రం భక్తుల పాలిట కొంగు బంగారం. ఒక కథనం ప్రకారం దేవలోకాధిపతి అయిన ఇంద్రుడికి శాపవిముక్తి కలిగించిన పుణ్యక్షేత్రంగా శుచీంద్రం ఆలయాన్ని పేర్కొంటారు.

- వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి


ఆలయ రాజగోపురం, తీర్థకొలను మండపం

ఒకప్పుడు ఇంద్రుడు గౌతమ మహర్షి భార్య అయిన అహల్యపై మనసుపడి, మహర్షి ఆశ్రమంలో లేని సమయంలో గౌతముడి వేషంలో ఆశ్రమంలోకి ప్రవేశించాడు. ఆ వేషంలో ఇంద్రుడిని చూసిన అహల్య ఇంద్రుడినే తన భర్తగా భావించింది. విషయం గ్రహించిన గౌతముడి ఆగ్రహంతో ఒళ్ళంతా వ్రణాలు రావాలని ఇంద్రుడిని శపించాడు. శాప విమోచనకై ఇంద్రుడు త్రిమూర్తులను ఆశ్రయించాడు. వారి సూచన ప్రకారం జ్ఞానారణ్యానికి వచ్చి త్రిమూర్తులు కొలువైన తానుమాలయన్ మూర్తిని దర్శించి, ఆ స్వామి దయతో శాపవిముక్తుడయ్యాడు. ఇంద్రుడికి శాపవిమోచనం జరిగిన ప్రదేశం కావడంతో దీనికి 'శుచీంద్రం' అని పేరు వచ్చిందని కథనం.

ఇంద్రునికి సంబంధించిన ఇంకొక విశేషం కూడా ప్రాంతంలో వ్యాప్తిలో ఉంది. ఇంద్రుడు తన పదవిని పదిలం చేసుకునే ప్రయత్నంలో వృతాసురుని సంహరించాడు. దానివలన కలిగిన బ్రహ్మహత్యా దోషాన్ని తొలగించుకునేందుకు జ్ఞానారణ్యంలో తపస్సు చేసి శివానుగ్రహంతో బ్రహ్మహత్యాదోషాన్ని తొలగించుకున్నాడు. దీనికి ప్రతీకగా అక్కడే శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. ఇంద్రుడి దోషానివారణ చేసి శుద్ధి చేసినస్థలం కావడంతో ఈ ప్రదేశం శుచీంద్రంగా పేరొందిందని ప్రాంతీయ కథనం.

మరో పురాణగాథ..

శుచీంద్రంతో ముడిపడిన మరో పురాణగాథ అత్రి, అనసూయలకు సంబంధించినది. అత్రి మహాముని భార్య, మహాపతివ్రత సతీ అనసూయతో కలిసి జ్ఞానారణ్యంలోని ఆశ్రమంలో నివసించేవారు. అత్రి హిమాలయాలకు వెళ్ళిన సందర్భంలో సతీ అనసూయ పాతివ్రత్యాన్ని పరీక్షించాలని త్రిమూర్తులు వృద్ధుల వేషంలో అత్రి ఆశ్రమానికి వచ్చి భిక్ష నర్థించారు. అయితే వివస్త్రగా భోజనాన్ని వడ్డిస్తేనే భుజిస్తామని, లేకుంటే భోజనం చేయకుండా నిష్క్రమిస్తామని వారు అనసూయకు చెప్పారు. దీంతో ఆమె ఆలోచించి వారిని చిన్న పిల్లలుగా మార్చింది. అనంతరం వారు కోరినట్లు వివస్త్రగా మారి వారికి పాలుపట్టి ఉయ్యాల్లో పడుకోపెట్టింది.. నారదుడి ద్వారా విషయం తెలుసుకున్న అత్రి మహర్షి తన ఆశ్రమానికి చేరుకున్నాడు.. చాలాకాలంగా భర్తల ఆచూకీ తెలియని లక్ష్మి, సరస్వతి, పార్వతులు నారద ముని సలహాపై జ్ఞానారణ్యానికి వచ్చి మాంగళ్య భిక్ష పెట్టమని అనసూయను అర్థించారు. అనసూయ పాతివ్రత్య మహిమతో ఆ పసిబిడ్డలు మళ్ళీ త్రిమూర్తులుగా దర్శనమిచ్చారు. ఆ జ్ఞానారణ్యమే నేటి శుచీంద్రమని ఇక్కడ మూల విరాట్ త్రిమూర్తుల రూపమని భక్తుల విశ్వాసం.


ఆంజనేయస్వామి

దత్తాత్రేయ క్షేత్రంగా...

శుచీంద్రం దత్తాత్రేయ క్షేత్రంగా కూడా ప్రసిద్ధిగాంచింది. ఆదిశంకరాచార్యులు ఈ శుచీంద్రం క్షేత్రాన్ని దర్శించినప్పుడు శివుడి తాండవ నృత్యాన్ని ప్రత్యక్షంగా చూశారనేది ఐతిహ్యం.


ఆలయ రథోత్సవం

ఆ పరమేశ్వరుడు స్వయంగా ప్రణవ మంత్రాన్ని ఆదిశంకరునికి ఈ శుచీంద్ర క్షేత్రంలోనే ఉపదేశించాడని మరో కథనం.

ఆలయ విశేషాలు...

ప్రధాన ఆలయంలోని మూల విరాట్‌ని తానుమాలయన్ స్వామిగా కొలుస్తారు. ఈ శివలింగాన్ని త్రిమూర్తులకు ప్రతీకగా భక్తులు భావిస్తారు. శివలింగంపై నుండే బంగారు తొడుగు త్రిమూర్తి స్వరూపం. సూచిస్తుంది. ఈ శివలింగ అర్చావతారాన్ని 'స్థానేశ్వరుడు'గా కూడా భక్తులు కొలుస్తారు. దీనికి మరొక ఇతిహాసం కూడా ప్రచారంలో ఉంది. శుచీంద్రానికి సమీపంలో ఉన్న కన్నియాకుమారి దేవాలయంలో ఉన్న పార్వతి దేవిని శివుడు వివాహం చేసుకోవాలని తలచి, సర్వ సన్నహాలు జరిగాయి. కొన్ని అవాంతరాల వల్ల శుచీంద్రం నుంచి వివాహానికి వెళ్ళలేకపోక, శివుడు తనస్థానం నుండి కదలక అక్కడే ఉండిపోవడంతో 'స్థానేశ్వరుడు'గా పేరు కలిగింది. అదేవిధంగా పార్వతి కూడా కన్యగా కన్నియాకుమారిలో భక్తులకు దర్శనమిస్తోంది. వివాహం కాని యువతీ, యువకులు శుచీంద్రంలోని స్థానేశ్వరుని దర్శించుకుంటే వివాహం కలుగుతుందని భక్తుల నమ్మకం. శుచీంద్ర దివ్యక్షేత్రం మహా మహిమాన్వితం. ఇక్కడ శివలింగానికి అభిషేకించిన జలం, శివలింగం దిగువ నుంచి వెళ్ళి కన్యాకుమారి దగ్గరలోవున్న సముద్రంలో కలుస్తుందనే కథనం ఉంది. ఈ స్థానేశ్వర లింగాన్ని ఇంద్రుడు ప్రతిష్ఠించాడని, ఈ ఆలయంలో రాత్రి వేళ ఇంద్రుడు వచ్చి స్థానేశ్వరునికి పూజిస్తాడని చెబుతారు.


ప్రాచీన శిల్పకళను చాటుతున్న స్తంభాలు

ఈ ఆలయానికి సమీపంలో వున్న పుష్కరిణిలో స్నానం చేస్తే పాపాలు తొలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. స్వామివారికి తెప్పోత్సవాలు కూడా ఈ ఆలయంలో జరుగుతుంటాయి. 173 అడుగుల ఎత్తుతో, ఏడంతస్తులు కలిగి వున్న రాజగోపురం ఆలయానికే ఒక ప్రత్యేక ఆకర్షణ. ఆలయ ప్రధాన ద్వారం 24 అడుగులు ఎత్తులో శిల్పకళా వైభవానికి నిదర్శనంగా కనిపిస్తుంది. ఆలయ ప్రాంగణం లోని భారీ హనుమంతుడి విగ్రహం విశ్వరూపంలో దర్శనమిస్తున్నట్లుగా నేత్రపర్వంగా ఉంటుంది. ఇక్కడ హనుమంతుడికి వెన్నపూసి ఆరాధించడం సంప్రదాయం.

ఆలయం వెలుపల ఉదయ మార్తండ వినాయకుడు, వీర భద్రస్వామి కొలువుదీరి ఉంటారు. ఆలయ ప్రాంగణంలో ఒకవైపు నందీశ్వరుడు, మరోవైపు చిదంబరేశ్వరుడు పూజలందుకుంటున్నారు. తిరువనంతపుర పాలకులైన వీర రవి మార్తండ వర్మ, రామవర్మ సోదరులు నిర్మించిన 9 అడుగుల ఎత్తైన నందీశ్వరుని విగ్రహం చూపరులను ఆకట్టుకుంటుంది. ఆలయాన్ని గవ్వల సున్నంతో నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి.

ఈ ఆలయంలోని సాక్షి వినాయకుడిని దర్శించకపోతే స్థానేశ్వరుని దర్శించినా పుణ్యఫలం లభించదని ప్రతీతి. అలంకార మండపంలోని పెద్ద రాతి స్తంభాలు, ఎన్నో అనుబంధ స్తంభాలు ఏక రాతిలో నిర్మించారు. ఇక్కడ ఉండే 223 రాతిస్తంభాల్లో కొన్ని సప్తస్వరాలు పలుకుతాయి. ఏ స్తంభాన్ని మీటినా సంగీతం వీనుల విందు చేస్తుంటుంది.. అలనాటి మన భారతీయ శిల్పకళా వైభవానికి ఈ ఆలయం నిలువెత్తు నిదర్శనం.

ఉపాలయాలు..

ఈ ప్రాంగణంలోని అలంకార మండపంలో కాలభైరవ, ధర్మరాజు, కనకదుర్గ, మహాదేవ, నారాయణ, శ్రీచక్ర తదితర ఉపాలయాలను తప్పక సందర్శించాల్సిందే. పక్కనే శిల్పకళా సంపద ఉట్టిపడే మండపంలో రెండు ధ్వజస్తంభాలు దర్శనమిస్తాయి. ఇందులో ఒకటి స్థానేశ్వరస్వామికి ఎదురుగా, మరొకటి విష్ణుమూర్తికి ఎదురుగా ఉన్నాయి. ఈ మండపంలోనే మరోవైపు సీతా సమేత శ్రీరామ మందిరం, భక్తుల కోర్కెలు తీర్చే వెంకటనాథుని ఆలయం కూడా ఉంది.. అంతేకాకుండా వసంత మండపంలోవున్న నవగ్రహాది దేవతలను పూజిసే గ్రహ దోషాలు పరిసమాప్తి అవుతాయని భక్తుల నమ్మకం.



శుచీంద్ర క్షేత్రంలో ప్రతిఏటా జరిగే రథోత్సవానికి దేశ,విదేశాల నుండి లక్షల సంఖ్యలో భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. శుచీంద్రం సమీపంలో అత్రి మహర్షి, అనసూయ నివసించిన ఆశ్రమం ఉది. 'ఆశ్రం' పేరుతో ఉన్న ఓ చిన్నగ్రామమే ఇది. అక్కడే అనసూయాదేవి మందిరం కూడా ఉంది.

ఎలా వెళ్ళాలి?...

కన్నియాకుమారి, నాగర్‌కోవిల్‌కు రైళ్లలో లేదా బస్సుల్లో వెళ్ళి అక్కడి నుండి ఈ క్షేత్రానికి వెళ్ళవచ్చు. కన్నియాకుమారి నుండి 14 కిలోమీటర్లు, నాగర్‌కోయిల్ నుండి 7 కిలోమీటర్లు, తిరువనంతపురం నుండి 80 కిలోమీటర్ల దూరంలో ఈ క్షేత్రం ఉంది. బస్సులు, క్యాబ్‌ల ద్వారా 'శుచీంద్రం' పుణ్యక్షేత్రానికి చేరుకోవచ్చు. ప్రకృతి సౌందర్యానికి ఆటపట్టుగా, శిల్పకళ, చిత్ర వైభవానికి నెలవుగా విరాజిల్లుతోంది.'శుచీంద్ర' పుణ్యక్షేత్రం.


స్వామివారు, పంచమూర్తుల ఊరేగింపు - ఆలయ దక్షిణ ప్రాకారంలోని మంటపం

సేంద్రియ రైతుల సంక్షేమమే లక్ష్యం

- ఐవోబీ ఎండీ, సీఈవో అజయ్‌కుమార్ శ్రీవత్సవ

ప్యారీస్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరంలో లక్షమంది సేంద్రియ రైతులకు సాధికారత కల్పించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐవోబీ) మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో అజయ్‌కుమార్ శ్రీవత్సవ పేర్కొన్నారు. ఎగ్మూర్‌లో గురువారం అమూల్ డైరీ, రిచ్ ప్లస్ సంస్థలతో సేంద్రియ రైతులకు సాధికారత కల్పించేలా ఐవోబీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అజయ్‌కుమార్ శ్రీవత్సవ సమక్షంలో అవగాహన ఒప్పందపత్రాలపై ఐవోబీ అధికారి విజయ, అమూల్ డైరీ ఎండీ అమిత్ వ్యాస్, రిచ్ ప్లస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ సారంగన్ సంతకాలు చేసారు. ఈ సందర్భంగా సేంద్రియ రైతుల కోసం నూతనంగా డిజైన్ చేసిన ఐవోబీ, అమూల్, రిచ్ ప్లస్ ఆర్గానిక్ ఫార్మింగ్ కార్డును కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఐవోబీ చీఫ్ మేనేజర్ వెంకటరమణ ఈ కార్డు ప్రత్యేకత వివరించారు. 'మట్టిని కాపాడుకుందాం, భూసార సామర్థ్యాన్ని పెంచుదాం' అనే నినాదంతో ఈ ఏడాదిలో లక్షమంది సేంద్రియ రైతులకు ఈ గుర్తింపు కార్డును పంపిణీ చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అజయ్‌కుమార్ శ్రీవత్సవ పేర్కొన్నారు.



ఒప్పంద కార్యక్రమంలో అజయ్‌కుమార్ శ్రీవత్సవ తదితరులు

ఏర్వాడి దర్గాలో ముగిసిన చందనోత్సవం

ప్యారీస్, మే 29 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా కీల్‌క్కరై సమీపంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఏర్వాడీ దర్గాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన చందనోత్సవం బుధవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలతో వైభవంగా ముగిసింది. ఏర్వాడీ కుతుబ్ సుల్తాన్ సయ్యద్ ఇబ్రహీమ్ షాహిద్ భాషా నాయగం దర్గాకు ఘన చరిత్ర ఉంది., ఈ క్షేత్రంలో నిర్వహించే చందనోత్సవంలో సర్వ మతాల వారు హాజరై మత సామరస్యాన్ని ప్రతీకగా నిలుస్తుంటారు. ఈ ఏడాది 851వ గంధ మహోత్సవం ఏప్రిల్ 29న ఇస్లాం ఉలామాల సమక్షంలో ప్రారంభమైంది.,. ఈ నెల 9వ తేదీ ఇబ్రహీం మహల్ నుండి ప్రారంభమైన జెండా ఊరేగింపు రాత్రి 7 గంటలకు ఏర్వాడి దర్గా ప్రాంగణానికి చేరుకుంది. దర్గా నిర్వాహకులు జెండా స్తంభంపై పతాకాన్ని ఎగురవేశారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం మత సామరస్యానికి ప్రతీకగా గంధం పాత్ర ఊరేగింపులో తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. గురువారం ఉదయం వరకు సాగిన గంధం పాత్ర ఊరేగింపులో పాల్గొన్న భక్తులందరికీ గంధం ప్రసాదంగా అందించారు. బుధవారం సాయంత్రం 5.30 గంటలకు రామనాథపురం జిల్లా ఖాజీ సలాహుద్దీన్ ఆలీమ్ నేతృత్వంలో ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి జెండా అవనతం చేశారు. ఆ తర్వాత 4వేల కిలోల బియ్యం, నెయ్యితో తయారు చేసిన ఆహారాన్ని భక్తులందరికీ ప్రసాదంగా పంపిణీ చేశారు. దాదాపు నాలుగు వారాల పాటు కోలాహలంగా నిర్వహించిన ఈ చందనోత్సవంతో ఏర్వాడీ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. రామనాథపురం జిల్లా ఎస్పీ సతీష్ ఆదేశాల మేరకు రద్దీలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రత కల్పించారు.


ముగింపు వేడుకల్లో పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు

వడపళని కావేరి హాస్పిటల్‌లో పల్మనరీ హైపర్‌టెన్షన్ క్లినిక్

చెన్నై, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలోని కావేరి హాస్పిటల్‌లో హృదయ సంబంధిత శ్వాసకోశ,రక్తపీడనం వంటి కీలకమైన సమస్యలకు నాణ్యమైన చికిత్స అందించేలా పల్మనరీ హైపర్ టెన్షన్ క్లినిక్‌ను ప్రారంభించారు.. కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ క్లినిక్‌లో శ్వాసకోశం, హృదయ సంబంధిత చికిత్సలకు ఎల్లవేళలా వైద్యనిపుణులు అందుబాటులో ఉంటారని, రోగులకు సకాలంలో చికిత్స అందిస్తారని కార్డియోవాస్కుల్ థొరాసిక్ సర్జరీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అన్బరసు మోహన్‌రాజ్ తెలిపారు. సీటీ, ఎంఆర్‌ఐ, లంగ్ పర్‌ఫ్యూషన్ స్కాన్ పరికరాలు ఈ క్లినిక్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రొఫెసర్ పి.మనోహర్, డాక్టర్ కీర్తనా గణేషన్, డాక్టర్ సుందర్ సి, మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ పూర్ణచంద్రన్, డాక్టర్ జెబరాజ్ తదితరులు పాల్గొన్నారు.


పల్మనరీ హైపర్ టెన్షన్ క్లినిక్ ప్రారంభిస్తున్న సీనియర్ వైద్యనిపుణులు

ఘనంగా వామ్ ఎలైట్ విభాగ్స్ ప్రారంభం

ప్యారీస్, మే 29 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆధ్యాత్మిక, విద్యా రంగాల్లో రాణిస్తున్న ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) తన సేవలను ప్రపంచ వ్యాప్తంగా విస్తరింపజేసే దిశగా 'వామ్ ఎలైట్ విభాగ్స్'ను ఆ సంస్థ గ్లోబల్ ఛైర్మెన్ మాజీ రాజ్యసభ సభ్యులు, సీతమ్మ ట్రస్ట్ తిరుపతి కమిటీ అధ్యక్షులు టీజీ వెంకటేష్ చేతుల మీదుగా ప్రారంభించింది. చూలైమేడు గిల్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన వామ్ కార్యాలయ భవనంలో బుధవారం రాత్రి వామ్ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో టీజీ వెంకటేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. తంగుటూరి రామకృష్ణ స్వాగతోపన్యాసంలో వామ్ సేవలను విశ్వవ్యాప్తం చేయాలనే లక్ష్యంతో సమష్టిగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. కరోనా లాక్‌డౌన్, వరదలు, తుఫాను, అగ్నిప్రమాదాలు సంభవించే సమయాల్లో ఆయా రాష్ట్రాల వామ్ నిర్వాహకులతో బాధితులకు వివిధ రకాల సహాయాలు అందజేసినట్లు తెలిపారు. వామ్ సేవలను మరింత విస్తృతం చేయాలన్న లక్ష్యంతో ఎలైట్ విభాగ్స్ ప్రారంభించినట్లు రామకృష్ణ పేర్కొన్నారు. వామ్ గ్లోబల్ అడ్వైజర్, జయరాజ్ ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ తాడేపల్లి రాజశేఖర్ వామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ఎలైట్ విభాగ్స్ పథకాలను సభకు వివరించారు. అనంతరం ముఖ్యఅతిథి టీజీ వెంకటేష్ మాట్లాడుతూ, ఉమ్మడి ఏపీ మాజీముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా ప్రారంభించిన వామ్ అంచెలంచెలుగా ఎదిగి, ప్రస్తుతం తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్రతో పాటు 60 దేశాల్లో విస్తరించి సమాజానికి సేవలందిస్తోందని, తంగుటూరి రామకృష్ణ సంస్థను అభివృద్ధి బాటలోకి నడిపిస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథితో పాటు సభాధ్యక్షులు, పలు ఆర్యవైశ్య సంస్థల తరుపున ఆత్మీయ అతిథులుగా పాల్గొన్న కేకే త్రినాథ్ కుమార్, సెంట్రల్ గవర్నమెంట్ సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్ కె.శ్రీనివాసమూర్తి, రవికుమార్, కుమరవేల్, యశ్వంత్, శ్రీలత తదితరులకు మెమోంటోలను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.



వామ్ ఎలైట్ విభాగ్స్ ప్రారంభోత్సవంలో టీజీ వెంకటేష్, తంగుటూరి రామకృష్ణ తదితరులు



మూడేళ్ల ఎల్ఎల్‌బీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సు రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో చూడాలని వర్సిటీ పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు. రీ వాల్యుయేషన్ కోసం జూన్ 9 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు.

సంస్కృత వర్సిటీలో దూరవిద్యకు దరఖాస్తుల ఆహ్వానం

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం దూరవిద్యా విభాగంలో పలు కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సంస్కృతంలో సర్టిఫికెట్ కోర్సు, డిప్లొమో, ప్రాక్ శాస్త్రి కోర్సులకు నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 8 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. సమగ్ర సమాచారం కోసం.. 94402 26562 నెంబరులో సంప్రదించాలని ఆ వర్సిటీ దూరవిద్యా డైరెక్టర్ ప్రొఫెసర్ రంగనాథ్ కోరారు.

ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీకి ఎన్‌బీఏ గుర్తింపు



ఎన్‌బీఏ గుర్తింపు ధ్రువీకరణ పత్రంతో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ నిర్వహిస్తున్న పలు కోర్సులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. ఇంజనీరింగ్ కాలేజీ పాటిస్తున్న బోధన, ఫలితాలు, సదుపాయాలు, ప్రమాణాలను ఈ నెల 7 నుంచీ మూడు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ గుర్తింపు ప్రకటించారు. సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాల ప్రగతిని ఎన్‌బీఏ బృందం అధ్యయనం చేసి ఈ గుర్తింపు ప్రకటించింది. దీనిపై ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కో-ఆర్డినేటర్ వెంకట్రామయ్య, డీన్ దామోదరరెడ్డి, ప్రొఫెసర్ రమాశ్రీ, ఇంజనీరింగ్ కాలేజీ అధ్యాపక బృందాన్ని అభినందించారు.

ఇంతకీ ఏం జరిగింది?

- నాయుడుపేట లాడ్జీలో ఇద్దరి మృతి
- యువకుడి మెడ కోసి ఉండటంతో అనుమానాలు
- యువతి ఉరేసుకుని ఆత్మహత్య
- అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు



లాడ్జీవద్ద రోదిస్తున్న శిరీష కుటుంబీకులు

నాయుడుపేట టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇద్దరికీ పెళ్లిళ్లయ్యాయి. ఆమె భర్తతో విడిపోయింది. అతడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. అలాంటిది.. మణి(35), శిరీష (25) మధ్య సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఏం జరిగిందో ఏమోగానీ.. గురువారం నాయుడుపేటలోని లాడ్జీలో ఇద్దరూ మృతిచెందారు. అతడి గొంతు కోసి ఉండగా.. ఆమె ఉరేసుకుంది. అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళెం గ్రామానికి చెందిన మణికి పెళ్లయింది. భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇక, శిరీషను చిన్నప్పుడే ఆమె తల్లి విజయమ్మ కుప్పరెడ్డిపాళెంలో నాయనమ్మ గురవమ్మ, లాజరస్ దంపతులకు అప్పగించింది. వాళ్లు పెంచి శ్రీకాళహస్తి సమీపంలోని సమీప బంధువుకు ఇచ్చి వివాహం చేశారు. కొంత కాలం తరువాత ఆమె విడాకులు తీసుకొని కుప్పరెడ్డిపాళెంలో నాయనమ్మ దగ్గర ఉంటుంది. ఈ క్రమంలో మణితో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. దీంతో మణి ఇంట్లో గొడవలు రేగాయి. కొద్ది రోజుల కిందట అతడి భార్య పుట్టింటికి అలిగివెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలో బుధవారం రాత్రి 8 గంటల సమయంలో మణి, శిరీష నాయుడుపేట బస్టాండు సమీపంలోని ఓ లాడ్జీలో గదిని అద్దెకు తీసుకున్నారు. గురువారం ఉదయం 8.30 గంటల సమయంలోనూ లాడ్జీ సిబ్బందితో మాట్లాడారు. ఆ తర్వాత గదిలోకి వెళ్లిన వీరు.. ఎంతసేపటికీ బయటకు రాలేదు. అనుమానం వచ్చిన సిబ్బంది కిటికిలో నుంచి చూడగా శిరీష ఉరేసుకుని.. మణి గొంతుకోసుకొని అధిక రక్తస్రావంతో పడి ఉండటాన్ని గుర్తించారు. వీరి సమాచారంతో డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి, ఎస్ఐ నాగలక్ష్మి మృతదేహాలను పరిశీలించారు. అనుమానాస్పద స్థితి మృతిగా కేసు నమోదు చేశారు.

ఎన్నో అనుమానాలు?

మణి గొంతు కత్తితో చాలా లోతుగా తెగిఉండటం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తనే కోసుకుని ఆత్మహత్య చేసుకొని ఉంటే అంతలోతుగా తెగి ఉండదని భావిస్తున్నారు. వాష్ బేసిన్లో రక్తపు మరకలు ఉండటంతో.. ఇక్కడ చేతులు కడిగి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఉరేసుకుని చనిపోయిన శిరీష చేతికీ రక్తపు మరకలు ఉండటాన్ని గుర్తించారు. దీంతో వీరిద్దరి మధ్య ఏం జరిగిందనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఆ గదికి గడియ వేసుండటంతో మూడో వ్యక్తి వచ్చిపోయే అవకాశం లేదు. అనుమానాస్పద స్థితిలో మృతిగా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య సంరక్షణకు 'యోగా'





మంగళం/తిరుపతి(క్రీడలు/కలెక్టరేట్), మే 29 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణకు ప్రతి ఒక్కరు యోగాను తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని, యోగాంధ్ర యాప్‌లో రిజస్ట్రేషన్ చేయించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం తిరుపతిలోని ఎస్వీ జూపార్కు వద్ద యోగా శిక్షణ నిర్వహించారు. ప్రతి ఒక్కరు మరో నలుగురితో యోగా చేయించాలన్నారు. ఇప్పటి వరకు గుర్తించి మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఈనెలాఖరు వరకు శిక్షణ కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్, జేసీ శుభంబన్సల్, జూ క్యూరేటర్ సెల్వం, డీఎఫ్‌వో వివేక్ వివిధ విభాగాల అధికారులు రామ్మోహన్, విక్రమ్‌కుమార్‌రెడ్డి, బాలకృష్ణనాయక్, జనార్దన్‌రెడ్డి, చరణ్‌తేజ్ రెడ్డి, సిబ్బంది యోగాసనాలు వేశారు. సాయంత్రం కలెక్టర్, జేసీ, కమిషనర్ మౌర్య యోగాంధ్ర నిర్వహణ, యోగాంధ్ర యాప్‌లో నమోదుపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. యాప్‌లో పది లక్షలమంది నమోదుకు లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 1.30 లక్షలు మాత్రమే నమోదవడం అసంతృప్తి వ్యక్తం చేశారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పెంపు

తిరుపతి(కలెక్టరేట్), మే 29 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువును మరో మూడు నెలలు పొడింగచనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరుతో గడువు ముగియనున్న నేపథ్యంలో ఆగస్టు 31 వరకు పొడిగించనున్నట్లు పేర్కొన్నారు. మీడియా సంస్థలో జర్నలిస్టుల వివరాలను జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో త్వరగా అందజేయాలన్నారు.





సభలో అమ్మాయిల ఉత్సాహం



మహానాడు వేదిక




సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు





మహా జాతర





కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం



